క్లుప్తంగా

ప్రమాదకరంగా ఎయిర్‌వాల్



సర్దార్‌నగర్-రావిర్యాల రోడ్డులో ప్రమాదకరంగా మారిన ఎయిర్‌వాల్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధి సర్దార్‌నగర్ నుంచి రావిర్యాల గ్రామానికి వెళ్లే రోడ్డులోని మంచినీటి ఎయిర్‌వాల్ ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో కొన్నేళ్ల కిందట మిషన్ భగీరథ పథకం నుంచి మంచినీటి సరఫరా పైపులైన్‌కు దీనిని ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును ఇటీవల రియల్ వ్యాపారులు తమ వ్యాపారం కోసం విస్తరించారు. దీంతో ఎయిర్ వాల్ రోడ్డు మధ్యలో ఉండి ఇలా ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందల వాహనాలు పరుగులు తీస్తుంటాయి. అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే ఎయిర్ వాల్‌ను పక్కకు మార్చాలని పలువురు కోరుతున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ప్రత్యేకాధికారి రాజారత్నం, నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారత్నం పాల్గొని 13 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, రమేశ్, అబ్బి సుందరయ్య, మండల మహిళా అధ్యక్షురాలు రాణి, అనసూయ, శ్రీనాథ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణం

కొత్తూరు: మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఆలయ కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యానారాయణ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

షాద్‌నగర్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే సోమవారం మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామంలోని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈదురుగాలులు, వడగళ్ల వర్షానికి గ్రామానికి చెందిన 8 మంది రైతులకు సంబంధించి సుమారు 20 ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

షాద్‌నగర్ ఏడీఏ బదిలీ

షాద్‌నగర్: గత ఏడేళ్లుగా షాద్‌నగర్ వ్యవసాయ డివిజనల్ అధికారిగా(ఏడీఏ) విధులు నిర్వహిస్తున్న రాజారత్నంకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ సోమవారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నారాయణపేట అగ్రికల్చర్ టెక్నాలజీ(ఆత్మ) పీడీగా బదిలీపై వెళ్లారు. షాద్‌నగర్ ఏడీఏగా అధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు. కొత్త ఏడీఏ వచ్చేవరకు ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిషాంత్ ఇన్‌చార్జిగా ఉండనున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు కృషిచేస్తామని బుడ్డిగారి కుమారులు బుడ్డిగారి సత్తయ్య, లక్ష్మయ్య, రాంచంద్రయ్య, నర్సింహ అన్నారు. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో తమ తల్లిదండ్రులు జంగయ్య, బుచ్చమ్మల జ్ఞాపకార్థం గత 15 రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు వారు సోమవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి షాద్‌నగర్ జట్టుకు రూ.30వేల నగదు, రెండో బహుమతిగా హైతాబాద్ జట్టుకు రూ.20వేల నగదు, మెమొంటోలను అందజేశారు.

భూభారతితో సమస్యల పరిష్కారం

- ఆర్డీఓ చంద్రకళ
- రైతు సమస్యను పరిష్కరించి ఆర్డర్ కాపీ అందజేత



రైతు మోహన్‌రెడ్డికి ఆర్డర్ కాపీ అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: భూభారతితో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు ఇక తీరినట్లేనని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం భూభారతి ద్వారా ఓ రైతు ఏళ్లనాటి కోర్టు సమస్యకు పరిష్కారం చూపించి పట్టా పాస్‌పుస్తకం కోసం అప్రూవ్ చేసిన కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూభారతి రైతుల పాలిట వరంలాంటిన్నారు. ఇకపై భూ సమస్యలు ఉండవన్నారు. కేతిరెడ్డిపల్లి రైతు మోహన్‌రెడ్డి కోర్టులో ఉన్న భూ సమస్య పరిష్కారమవడమే దీనికి నిదర్శనం అన్నారు. మండలంలోని కేతిరెడ్డిపల్లికి చెందిన మోహన్‌రెడ్డికి అదే గ్రామంలోని సర్వే నెంబర్ 399, 397లలో ఒక ఎకరం 12 గుంటల భూమి ఉంది. ఈ భూమి మీద తన భార్య కోర్టులో కేసు వేసింది. కోర్టులో మోహన్‌రెడ్డికి తీర్పు అనుకూలంగా వచ్చింది. కాని దీనికి సంబంధించి ఆయనకు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి పాస్‌పుస్తకం ఇవ్వలేకపోయారు. దీంతో ఆయన గత ఏడాది కాలంగా సమస్య పరిష్కారం కోసం కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. దీనిపై భూభారతిలో ఆయన సమస్యను పరిష్కరించామన్నారు. సమస్యలను పరిష్కరించటంతో పాటు సోమవారం ఆయనను పిలిచి పాస్‌పుస్తకం కోసం అప్రూవ్ చేసినట్లుగా ఓ కాపీని అందజేసినట్లు తెలిపారు. రైతులు ఎవరూ భూ సమస్యలు పరిష్కారం కావటం లేదని ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. ఈ సందర్భంగా రైతు మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశాడు.

ఆ భూములను పంచాయతీకి ఇవ్వాలని వినతి



రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: మహదేవ్‌పూర్ రెవెన్యూ గ్రామానికి సంబంధించిన భూములను గ్రామపంచాయతీల విభజనలో భాగంగా పులుసుమామిడి గ్రామానికి కేటాయించారని, దీంతో తమ గ్రామానికి రావాల్సిన రెవెన్యూ పులుసుమామిడి గ్రామానికి పోతుందని మహదేవ్‌పూర్ గ్రామస్తులు వాపోయారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో భాగాంగా మహదేవ్‌పూర్ గ్రామానికి వచ్చిన రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 200, 202, 203, 308, 312, 346 భూములను మహదేవ్‌పూర్ గ్రామపంచాయతీకి కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాగళ్ల నర్సింహ, సంజీవ తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులను వాడాలి

- అగ్రోనమీ వ్యవసాయ శాస్త్రవేత్త నీలిమ
- వెంకన్నగూడలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం
- రైతులకు పంటల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నీలిమ

మహేశ్వరం: రైతులు పంట పొలాల్లో రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయని అగ్రోనమీ వ్యవసాయ శాస్త్రవేత్త టీఎల్.నీలిమ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గొల్లూరు పంచాయతీ వెంకన్నగూడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి వ్యవసాయ, ఉద్యానవన శాస్త్రవేత్తలతో రైతులకు సాగులో పాటించాల్సిన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షలను చేసి వాటి ఆధారంగా వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే పంట దిగుబడి అధికంగా రావడంతో పాటు తెగుళ్లు సోకవన్నారు. ఈ ప్రాంతం హైద్రాబాద్‌కు దగ్గరలో ఉండడంతో ఉద్యాన పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. అంతకు ముందు రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవశాఖ శాస్త్రవేత్త డా.రజిని, మండల వ్యవసాయాధికారులు మమత, నందిని, చంద్రశేఖర్, ఏఈఓ దీనా, రైతులు ఆనంద్, దర్శన్, ఎన్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కొనాయపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొనాయపల్లి, సంతాపూర్ గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అధ్వర్యంలో జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సవరణల ద్వారా రాజ్యాంగం వారికి అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో అడ్డుకుందని, రాజ్యాంగ సవరణపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించి, వారిని కూడా ఉద్యమంలో భాగస్వాములను చేయాలనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మొయినాబాద్: పదిలో ఉత్తమ ఫలితాలతో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు సన్మానించారు. ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో కనకమామిడి పాఠశాల విద్యార్థిని గౌతమి 525 మార్కులతో మొదటి స్థానం, పెద్దమంగళారం పాఠశాల విద్యార్థిని పి.మానస 523 మార్కులతో ద్వితీయ స్థానం, ఎన్కెపల్లి పాఠశాల విద్యార్థిని సాదియా అంజుమ్ 522 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ మల్లయ్య, రిటైర్డ్ ఎంఈఓ వెంకటయ్యల చేతులమీదుగా సన్మానించారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులను సైతం సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్, అబ్దుల్ అమీద్, లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటల్లోనూ రాణించాలి



ఆమనగల్లు: మాట్లాడుతున్న కమిషనర్



యాచారం: విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న ఎంఈఓ వెంకట్‌రెడ్డి

మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు: విద్యార్థులు చదువుతో పాటు ఆటాపాటలల్లోనూ రాణించాలని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ సూచించారు. వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేయకుండా, తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ తీసుకోవాలన్నారు. పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ పాండుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 19 వరకు కరాటే, యోగా, ఆటలు, పాటలు, డ్రాయింగ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచితంగా అల్పాహార వసతి కల్పించిందని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడొద్దని చెప్పారు.

చింతపట్లల్లో..

యాచారం: మండల పరిధి చింతపట్ల గ్రామం ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఇంగ్లిష్, గణితం, డ్రాయింగ్, క్రీడా పోటీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణకు వచ్చిన చిన్నారులకు అల్పాహారం అందజేశారు. ఈ శిబిరం 15 రోజుల పాటు ఉపాధ్యాయులు అంజయ్య, సాబేర్, శ్రీకాంత్‌ల పర్యవేక్షణలో కొనసాగుతుందని ఎంఈఓ తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎంఈఓ స్టేషనరీని అందజేశారు.

సుస్థిర వ్యవసాయమే లక్ష్యం

శాస్త్రవేత్తల సూచనలు పాటించండి..
- సాగులో దిగుబడులు పొందండి
- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి
- 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' ప్రారంభం

కడ్తాల్: భవిష్యత్ తరాలకు సుస్థిర వ్యవసాయ పద్ధతులను అందించడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం- వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్‌తో పాటు మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, విశ్వ విద్యాలయ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ విద్యాసాగర్, సయ్యద్ ఆహ్మద్ హుస్సేన్, డాక్టర్ మాధవీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వచ్చి సలహాలు, సూచనలు అందించడం గొప్ప విషయమని, వారి సూచనల మేరకు రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్తలు సాగులోని మెలకువలు, నీటి యాజమాన్యం, భూసారం పెంపు, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, సాగు ఖర్చులు తగ్గించడం, పంట మార్పిడి, పర్యావరణ రక్షణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ అరుణకుమారి, ఏఓ శ్రీలత, మార్కెట్ డైరెక్టర్ నరేశ్‌నాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు బీక్యానాయక్, నర్సింహ, బీచ్యానాయక్, జంగారెడ్డి, చందోజీ, ఏఈఓలు అభినవ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కశ్యప్, అనూష, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కృత్రిమ పద్ధతిలో వ్యవసాయం

తుర్కయంజాల్: రైతులు కృత్రిమ పద్ధతిలో వ్యవసాయం చేయాలని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐఎస్‌పి ప్రోగ్రాం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన పలు ప్రశ్నలకు యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రజనీకాంత్ సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పల్లవి, ఏఈఓ రఘుపతి, శాస్త్రవేత్త అరుణ, రైతులు లక్ష్మారెడ్డి, బల్‌దేవ్ రెడ్డి, ఐలయ్య, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

మార్కెట్ చైర్‌పర్సన్ గీత



రైతులకు భోజనం వడ్డిస్తున్న చైర్‌పర్సన్ గీత

ఆమనగల్లు: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం సొంత డబ్బుతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం విక్రయించడానికి మార్కెట్‌కు వచ్చే రైతులకోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించానని, ప్రస్తుత సీజన్ ముగిసేవరకు భోజనం అందిస్తానని చెప్పారు. రైతులు భోజన వసతిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నదాతలు దళారులను ఆశ్రయించకుండా.. కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని, సన్నాలను రూ.500 బోనస్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, అజీం, రమేశ్‌గౌడ్, నరేశ్ నాయక్, శ్యాంసుందర్‌రెడ్డి, అంజయ్యగుప్తా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, కల్వకుర్తి తాలుకా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఇమ్రాన్‌బాబా, మల్లయ్య, ఖాదర్, నాజర్, నరేశ్‌నాయక్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



మీర్‌పేట: ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న అంజయ్య తదితరులు

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి
- ఎమ్మెల్యే సబితారెడ్డి
- ఘనంగా జన్మదిన వేడుకలు



మహేశ్వరం: ఎమ్మెల్యే సబితారెడ్డికి ఇంద్రారెడ్డి చిత్రాన్ని బహూకరిస్తున్న గులాబీ శ్రేణులు

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పని చేస్తానని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా సోమవారం జిల్లెల్‌గూడ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేకు బీఆర్‌ఎస్ శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కేక్‌కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, కల్యాణ్ రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంబయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్ ఉన్నారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో..

తుక్కుగూడ: తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే సబితారెడ్డి జెన్నాయిగూడ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల మధ్య కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, అభిమానులు శ్రీనగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, భారీ గజమాలతో సన్మానించారు. కేక్‌కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శోభ ఆనంద్‌రెడ్డి, రామిడి కవిత, భీమిడి స్వప్న జంగారెడ్డి, సూర్లగంటి అర్జున్, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి మమత కృష్ణారెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ వింగ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



మీర్‌పేటలో.. రక్తదానం

మీర్‌పేట: ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదిన వేడుకలు జిల్లెలగూడ ఎస్వైఆర్ గార్డెన్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా జరిపారు. మాజీ కార్పొరేటర్లు దోమలపల్లి ధనలక్ష్మి రాజ్‌కుమార్, అనిల్‌కుమార్ యాదవ్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు పట్లోళ్ల కౌశిక్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. మేకల యాదగిరి, భూపేష్‌గౌడ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ సిద్దాల పద్మ అంజయ్య దంపతులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సరూర్‌నగర్‌లో..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మీర్‌పేట మాజీ సర్పంచ్ ఆర్.గోపాల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్‌లో జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు అంకిరెడ్డి కేక్ కట్‌చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు కొండల్‌రెడ్డి, అరవింద్‌శర్మ, నారాయణ పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపాలిటీలో..

పహాడీషరీఫ్: ఎమ్మెల్యే సబితారెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జల్‌పల్లి మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్‌ల నేతృత్వంలో ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు జనార్దన్, పల్లపు శంకర్, నిరంజన్, అర్జున్, సుభాష్, గోపాల్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, వాసు బాబు, హుస్సేన్, నవపేట ఆంజనేయులు, ఇద్రీస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: వీఎంహోంలో విద్యార్థుల మధ్య కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



పహాడీషరీఫ్‌లో.. ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్ తదితరులు



తుక్కుగూడ: కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి